



ఇంటికి తాళం వేసి వుండటంతో ఒక్కసారే నీరసం వచ్చేసింది. రాణి ఎక్కడకు వెళ్ళుంటుంది? చెమటతో తడిసిన బట్టలు, కాఫీ కోసం ఆరాటం కొంత చికాకును తెచ్చి పెట్టాయ్.

మాది మొత్తం నాలుగు పోర్షనులున్న లోగిలి. అందులో రకరకాల మనస్తత్వాల, ఉద్యోగాల వాళ్ళం కాపురముంటున్నాం. దాదాపు అందరికీ ఉద్యోగాలే. ఒకాయనకు మాత్రం చిన్న వ్యాపారం. ప్రక్కకు చూశాను. అంతలోనే ఎదురుగా 'దేనియల్' గారింటి వైపు కూడా చూశాను. అన్నీ తాళాలు వేసే వున్నాయి.

కొంపతీసి ఎవరికేవన్నా అయిందా అనుకున్నాను. అయితే ఆఫీస్‌కు కబురు వచ్చేది! ఏమయివుంటుంది? మహిళలందరూ కలిసి సినిమాకు చెక్కేసారేమో ననుకున్నా క్రొత్తగా వచ్చిన భక్తిసినిమా, నవలా చిత్రాలు కూడా లేవు. ఎక్కడికి వెళ్ళుంటారు? ఎక్కడికన్నా వెళ్ళాలనుకుంటే రాణి ముందే చెబుతుంది. వెనక్కు తిరిగాను. ఆ గదులూ తాళం కప్పలతో కనిపించాయ్.

ఇదేదో ఉద్యమంలా ఉందే అనిపించింది. అయినా వీళ్ళలో అంత స్పందన, చైతన్యం ఏకోశానా లేవు. పూజలూ, పునస్కారాలూ, భక్తి సినిమాలు, ఇరుగు పొరుగు కష్టసుఖాలు, సీరియల్ నవల్లు, ప్రక్క ఊర్లలో పుట్టుకొచ్చే అమ్మలు ... బాబాలు, బ్రహ్మంగారి కాలజ్ఞానం, వంటకాలు, కట్నాలు, కానుకలు, కుట్లు, అల్లికలు. వీటిని మాత్రం చర్చలో పెడితే ఏ విషయమూ గుర్తురాదు. వీళ్ళంతా దైనందిన జీవితంలో ఓ రొటీన్ కార్యక్రమానికి అలవాటు పడిపోయారు. భర్తను దైవంగా చూసుకోవడమే జీవిత పరమార్థంగా భావించే వీరంతా చేపట్టిన మహత్తర ఉద్యమం ఏమిటంటే భజన సంఘనిర్వహణ. కోటా కార్యక్రమంతో చక్కటి టిఫిన్లతో కాలం గడుపుతుంది ఈ సమాజం. ఏమాట కామాటే చెప్పుకోవాలి. వీరి వంటకాలు మహా రుచిగా ఉంటాయి.

వీరిలో చైతన్యం కలిగించాలని నేను చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కాగా నన్ను పిచ్చివాడుగా చూడటం వీరి అలవాటు. అంతమాత్రాన నిరుత్సాహ పడలేదనుకోండి. అనుభవంతోగాని ఓ విషయం మీద బలమైన అభిప్రాయం ఏర్పరుచుకోవటం సాధ్యం కాదు. ఎక్కడికీ వెళ్ళాలనిపించక అక్కడే కూర్చున్నాను.

చీకటి పడుతుండగా రాణి వచ్చింది హడావిడిగా.

"ఎంతసేపయిం దొచ్చి" అంటూ.

"అదిసరేలే, మీరంతా ఎక్కడకు వెళ్ళారు" అన్నాను.

"దేనియల్‌గారావిడికి నొప్పులొస్తేనూ" అంది తాళం తీస్తూ. అప్పుడు గుర్తుకొచ్చింది. అవును కదా! ఆయన తండ్రి కాబోతున్నాడు. అయిదు నిముషాల్లో కాఫీ చేసి ఇచ్చింది.

"ఏమయింది మరి" అన్నాను త్రాగుతూ.

"ఇంకా ఎక్కడ. నొప్పులొస్తున్నాయి. మీ కోసం వచ్చాను. మళ్ళీ వెళ్ళాలి" అంటూనే వంట కార్యక్రమంలో మునిగిపోయింది. త్వర త్వరగా వంట ముగించేసి.—

"ఆకలయితే మీరు భోంచేయండి. లేకుంటే ఆగండి" అంది వెళ్తూ. ఆలోచనల్తో నిద్రపట్టేసింది. రాణి ఎప్పుడు వచ్చిందో తలుపు తడుతుంటే మెలకువ వచ్చింది.

"భోంచేశారా?"

"లేదు"

"లేవండి మరి"

"ఏం పిల్ల"

"ఆడపిల్ల"

''ఊహూ'' అన్నాను,

రాణి మెల్లగా అంది.

''ఆ పిల్ల చాలా వికారంగా పుట్టింది. కాళ్ళు చేతులవీ లేవనుకుంటా. మమ్మల్ని చూడనివ్వలేదు. దడుసుకుంటామని.''

''ఎందుకట అలా జరగటం?'' ఆరాటంతో అడిగాను.

''ఏమో బాబు. దేనియల్‌గారి అక్క కూతు రేగా ఆవిడ'' అంది.

ఓహ్! మేనరికం! ఎన్ని అనర్థాలకు దారి తీస్తుంది. అప్యాయతలూ, అనురాగాలూ ఉండొచ్చు. కానీ ఈ విధంగా పెళ్ళిళ్ళు చేసుకోవటం మూలాని ఎంత నష్టం? ఆలోచించరేం!

''భోంచేద్దురుగాని రండి'' అంది రాణి.

నాకు మనస్కరించలేదు. మంచి నీళ్ళు తాగి పడుకున్నాను. రాణి కూడా భోంచేయలేదు. పడుకున్నాక అంది.

''పాపను తీసుకెళ్ళి పోయారు''

''ఏమిటీ, పోయిందా?'' ఆశ్చర్యంగా అన్నాను.

''అలాంటి వాళ్ళు బ్రతకరు''

''అయ్యో'' నాకు తెలియకుండానే అన్నాను.

''వాళ్ళ నాయనమ్మను చూశారా మీరు'' అంది రాణి. ఆవిడ్ని చూశాను. ముఖనిండా అనుభవాలు ముడతల్లా పడి ఉంటాయి. దేనియల్‌వారి కుటుంబం చాలా పెద్దది.

''ఊఁ చూస్తే....''

''ఆ పిల్లను తీసుకెళ్తుంటే కొంచమయినా బాధపడలేదు. ఏదో బరువు తగ్గినట్లు భావిస్తున్న ట్లుంది'' అంది.

''దేనికట'' అన్నాను యధాలాపంగా

''ఆడది కదా'' అంది కొంచెం విసుగ్గా.

చాచి చెంపమీద కొట్టినట్లయింది. సామాజిక స్పృహలేని రాణిని చూస్తుంటే అనిపించింది. వికృతంగా ఉన్న పాప రూపం, వికృతంగా ఉన్న వ్యవస్థ రూపం. ఆ ముసలావిడ్ని రాణి అర్థం చేసుకోలేకపోవచ్చు. నాకు జాలి కలిగింది.

ఆడది బరువు ఈ సమాజంలో....

ఆడది అడ్డంకి....

ఆ పాపనయితే స్మశానానికి తీసుకెళ్ళారు....

మరి....ఈ వ్యవస్థనో....!?

□



# అగ్నిప్రమాదాలు

వేసవిలో ఎన్నో గృహాలు అగ్నికి ఆహుతై పోవటం సర్వసాధారణమైపోయింది. అందుకనే వేసవిని ''అగ్ని ప్రమాదాల సీజన్''గా పెద్దలు అంటుంటారు. వేసవిలో అన్ని వస్తువులూ ఎండకు ఎండి పొడిగా ఉంటాయి కాబట్టి నిప్పు తగిలీ తగల గానే భగ్గున మండుతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచంలో ఇంతవరకు రోడ్డు ప్రమాదాల్లో మరణించినవారి కంటే అగ్ని ప్రమాదాల్లో మరణించినవారి సంఖ్యే ఎక్కువట. అగ్ని ప్రమాదాలు ఎంత తీవ్ర రూపం ధరించాయో అంచనా వేయటానికి ఈ ఒక్క ఉదాహరణ చాలు. దేశంలో ఏటా 150 నుంచి 200 కోట్ల రూపాయల విలువైన ఆస్తి అగ్ని ప్రమాదాలకు ఆహుతై పోతున్నట్లు అంచనా వేశారు. 1979 లో మన రాష్ట్రంలో మొత్తం అయిదువేల అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాలవల్ల 50 కోట్ల రూపాయల ఆస్తి నష్టం సంభవించింది. 71 మంది ప్రాణాలు కోల్పోయారు.

## స్త్రీలే కారణమా?

మన దేశంలో ఏటా జరుగుతున్న అగ్ని ప్రమాదాల్లో 80 శాతం స్త్రీలు పిల్లల వల్ల జరుగుతున్నట్లు అంచనా వేశారు. అంటే వారు అగ్ని పట్ల అజాగ్రత్త చూపటం వల్లనే ఈ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయట. చిన్న నిప్పు కణమేనని ఊరుకుంటే అది పెద్ద అగ్ని ప్రమాదానికి కారణం కావచ్చు. వేసవిలో నిప్పుపట్ల చాలా జాగ్రత్తగా ఉండాలి. ఇళ్ళలోని గ్యాస్‌స్టవ్, కుంపటి, నూనె దీపాలు, కరెంట్ దీపాలు మొదలైనవన్నీ అగ్ని ప్రమాదాలకు ఆధారాలే, గ్యాస్ లీక్ అయి ఉంటే అగ్గిపుల్ల గీయటం గాని, లైటు వేయటం గాని, వేసి ఉన్న లైటును తీయటం గాని చేయకూడదు. కిరోసిన్ స్టవ్‌కు దగ్గరగా కేలండర్ లాంటివి ఉంటే స్టవ్ మంట హెచ్చించినప్పుడు పొరపాటున కేలండర్ అంటుకుంటే అది పెద్ద ప్రమాదానికి దారి తీయవచ్చు. కూర మాడిపోతుందని మసిగుడ్డ దొరక్కపోతే చీర కొంగుతోనే దింపి ప్రాణాల మీదకు తెచ్చుకున్నవారు ఎందరో ఉన్నారు. అదే విధంగా వెలుగుతున్న స్టవ్‌లోకి కిరోసిన్ పోసేటప్పుడు కూడా ప్రమాదాలు జరగవచ్చు. స్త్రీలు వంట చేసేటప్పుడు సిల్క్, పాలియస్టర్ చీరలకంటే కాటన్ చీరలు కట్టుకొని చేయటం మంచిది. ఇంట్లో సిగరెట్లు కాల్చే మగవారు ఉంటే వారిని కూడా జాగ్రత్తగా ఉండమని హెచ్చరించటం మంచిది. ఎందుకంటే వారు కాల్చి పారేసిన సిగరెట్ ముక్కగాని, గీసి పారేసిన అగ్గిపుల్లగాని ప్రమాదాలకు హేతువు కావచ్చు. ఇక గ్రామాల్లో చాలామంది చూరు కింద వంట చేస్తుంటారు. దీనివల్ల కూడా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

## ఎటువంటి జాగ్రత్త అవసరం?

అగ్ని ప్రమాదం జరిగినప్పుడు భయంతో చిందులు వేయటం కంటే ఇరుగు పొరుగుల సాయంతో మంటలను ఆర్పటానికి ప్రయత్నించటం మంచిది. దీనికంటే ముందుగా అగ్ని మాపక కేంద్రం వారికి ఈ విషయాన్ని ఫోన్ ద్వారా తెలియజేయాలి. ఇంట్లో వారి నందరిని సురక్షిత ప్రాంతానికి సాధ్యమైనంత త్వరగా తరలించాలి. చిన్న పిల్లలు భయంతో ఏ మంచం కిందనో బీరువా చాటునో దాక్కోవచ్చు. కంగారులో వారిని మర్చిపోతే తర్వాత వారిని అగ్నికి ఆహుతి చేశామని జీవితాంతం బాధపడవలసి వుంటుంది. వేసవిలో అగ్ని ప్రమాదాలు జరుగుతున్న తీరు తెన్నులను, పరిశీలించినట్లయితే ఎక్కువ శాతం అగ్ని ప్రమాదాలు ప్రజల నిర్లక్ష్యం వల్లనే జరుగుతున్నట్లు తేలుతోంది.

అగ్ని ప్రమాదాలు గురించి ప్రజలకు సవివరంగా తెలియజేయటం ద్వారా వాటిని నివారించవచ్చు. ఈ బాధ్యతను మన దేశంలో నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ (జాతీయ భద్రతా మండలి) చేపట్టింది. దీని ప్రధాన కార్యాలయం బొంబాయిలో వుంది. దీని శాఖలు ఆంధ్ర దేశంతోసహా అనేక రాష్ట్రాలలో వున్నాయి. ప్రమాదాల నివారణ గురించి భద్రతా మండలి ప్రచారం ద్వారా కృషి చేస్తున్నా అది గ్రామీణులకు అందడం లేదు. ఈ కారణంగా భద్రతా మండలి ఆంధ్రప్రదేశ్ శాఖ ''ఇళ్ళలో అగ్ని ప్రమాదాలు'' పేరుతో తెలుగులో 52 పేజీల పుస్తకాన్ని ముద్రించింది. ఈ పుస్తకంలో అగ్ని ప్రమాదాలు జరిగే ప్రతి చిన్న విషయాన్ని పేర్కొని వాటి నివారణ చర్యలను తెలియజేశారు. ప్రజలందరూ అప్రమత్తతతో వుంటేనే గాని అగ్ని ప్రమాదాలను అరికట్టటం సాధ్యం గాదు.

—పి. లక్ష్మి